
ఆంధ్రజ్యోతి



నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 4 ఆగస్టు 2024

కర్నూలుకు ఏరువాక కేంద్రం



నంద్యాలలో ఏరువాక కేంద్రం కార్యాలయం



- తరలింపు ఉత్తర్వుల కలకలం
- ఓ కీలక అధికారి ఏకపక్ష నిర్ణయం..?
- ఆప్కాస్ కాంట్రాక్టు సిబ్బంది కోసమేనని విమర్శలు
- ఆందోళనలో రైతులు

నంద్యాల టౌన్, ఆగస్టు 3 : నంద్యాలలోని ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్)ను కర్నూలుకు తరలిస్తున్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.రామచంద్రారావు తరలింపునకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో గతంలో ఏరువాక కేంద్రాన్ని బనవాసి కేంద్రంగా నిర్వహించేవారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా బనవాసిలో ఉన్న ఏరువాక కేంద్రాన్ని నంద్యాలకు మార్చారు. ఏరువాక కేంద్రాన్ని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణలో ఇప్పటి వరకు నిర్వహిస్తున్నారు.

కీలక అధికారి ఏకపక్ష నిర్ణయం

గుంటూరు లామ్‌లోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి హోదాలో అత్యంత కీలకమైన పోస్టులో ఉన్న ఓ మహిళా అధికారి ఏరువాక కేంద్రం తరలింపు విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నంద్యాలలో ఏరువాక కేంద్రంలో ఆప్కాస్ విధానంలో కొందరు ఆ మహిళా అధికారికి సంబంధించిన సన్నిహితులు పని చేస్తున్నారు. వీరంతా కర్నూలు నుంచి నంద్యాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆప్కాస్‌లో నియమించిన ఉద్యోగుల కోసం, ప్రయాణ ప్రయాసలు తప్పించేందుకు ఏకంగా నంద్యాలలోని ఏరువాక కేంద్రాన్ని కర్నూలుకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత నంద్యాలకు కేటాయించిన ఏరువాక కేంద్రాన్ని ఉన్నట్టుండి గుట్టు చప్పుడు కాకుండా కర్నూలుకు తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపుతోంది. మూడు రోజుల క్రితమే తరలింపు ఉత్తర్వులు గుంటూరులోని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పేరుతో ఆదేశాలు వెలువడ్డాయి. ఈనెల 14వ తేదీలోగా కర్నూలుకు తరలించాలంటూ ఆదేశించారు. అక్కడి రైతుల వినతి మేరకు ఏరువాక కేంద్రాన్ని తరలిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌కు సంబంధం లేదు



నంద్యాలలోని ఏరువాక కేంద్రాన్ని కర్నూలుకు తరలిస్తున్నారు. విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలకు, ఆర్ఏఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదు. మిగతా విషయాలు తెలియవు.

- ఏడీఆర్, డాక్టర్ జాన్సన్

అధికార వర్గాల్లో విస్మయం

నంద్యాలలోని ఏరువాక కేంద్రాన్ని ఉన్నట్టుండి కర్నూలుకు తరలించాలంటూ వచ్చిన ఆదేశాలు ఇక్కడి వ్యవసాయ శాఖ, ఆర్ఏఆర్ఎస్‌లోని శాస్త్రవేత్తలు, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఓ మహిళా కీలక అధికారి తనకు సంబంధించిన వారి కోసం ఏకంగా ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని కర్నూలుకు తరలించాలన్న ఆదేశాలు అధికార వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏరువాక కేంద్రాన్ని కర్నూలుకు తరలిస్తున్న సమాచారం బయటకు పొక్కడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలుకు తరలించకుండా నంద్యాల జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.



ACHARYA N.G.RANGA AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Lam, Guntur - 522 034, A.P.

// FORWARDED :: BY ORDER //

కర్నూలుకు తరలిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

ప్రసన్నకు రూ.10 లక్షలు

- బాలిక నాయనమ్మకు రూ.2 లక్షలు
- చిన్నవంగలి ఘటనపై చలించిపోయిన సీఎం
- ఆర్థిక సాయం ప్రకటించిన చంద్రబాబు నాయుడు



చాగలమర్రి, ఆగస్టు 3: చాగలమర్రి మండలం చిన్నవంగలి ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చలించిపోయారు. బాధిత కుటుంబానికి చెందిన బాలికకు ఆర్థిక సాయం ప్రకటించారు. గురువారం అర్థరాత్రి మట్టిమిద్దె కూలడంతో చిన్నవంగలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ దంపతులు, కుమార్తెలు పవిత్ర, గురులక్ష్మిలు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రెండో కుమార్తె ప్రసన్న అనాథగా మిగిలింది. ప్రమాద ఘటన సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి ప్రసన్నకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రసన్న నాయనమ్మ నాగమ్మ సంరక్షణలో ఉందని తెలుసుకున్న సీఎం ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతోపాటు వృద్ధురాలు నాగమ్మకు రూ.2 లక్షలు అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా అధికారులు విద్యార్థిని ప్రసన్నను కలిసి ధైర్యం చెప్పాలని సూచించారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులు కోల్పోయిన ఆ బాలికకు అండగా నిలవాలని చెప్పారు. మరో వైపు పార్టీ పరంగా కూడా ప్రసన్నకు బాసటగా నిలుస్తామని సీఎం ప్రకటించారు. బాలిక సంరక్షణ, విద్య విషయంలో పార్టీ నుంచి కూడా అండగా ఉంటామని పేర్కొన్నారు. అనాథ బాలిక ప్రసన్నకు రూ.10 లక్షలు ప్రకటించిన సీఎంకు రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



శ్రీశైలం, ఆగస్టు 3: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టు గేట్లను శనివారం 10 క్రస్టు గేట్లను 20 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 2,63,532 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,67,556 క్యూసెక్కులు మొత్తం 4,33,088 వరద ప్రవాహం వస్తోంది. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 4,24,466 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.50 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 24,618 క్యూసెక్కులు, తెలంగాణ జల



విద్యుత్ కేంద్రం ద్వారా 38,050 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టు గేట్ల ద్వారా 4,61,560 క్యూసెక్కులు మొత్తం 5,24,228 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

నేడు పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 3: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు జిల్లా పరిషత్‌లో ఆదివారం జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని తాలూకా యూనిట్ల ఎన్నికలు రెండు నెలల క్రితమే ముగిశాయి. పదేళ్ల తరువాత ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2014 నుంచి 2021 వరకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ క్రమంలో జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు నిర్వహించేందుకు సంఘం నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే గత కాలంగా జడ్పీ యూనిట్‌లో రెండు వర్గాలుగా ఉద్యోగులు విడిపోయారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గరకి రావడంతో వేడి మొదలైంది. ఇరువర్గాలు తమ పంతం నెగ్గించుకునేందుకే పావులు కదుపుతున్నారు.

● ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు ఎన్నికల బరిలో..

జిల్లా పరిషత్ యూనిట్ పరిధిలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు ఎలాగైనా ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కొందరు ఉద్యోగులు దీనిని అడ్డుకుంటున్నారు. ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు మాత్రమే పోటీ చేయాలని కొందరు అంటుంటే.. లేదు ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు కూడా పోటీ చేయవచ్చని మరో వర్గం భీష్మించుకుని ఉంది. దీంతో రెండు వర్గాల మధ్య వైరం నెలకొంది. జడ్పీ యూనిట్‌లో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు ఎన్నికల్లో గెలిస్తే బదిలీల్లో మినహాయింపు ఉంటుంది.

● మ్యానిఫెస్టో ప్రకటించిన ఓ వర్గం..

రెండు వర్గాలుగా విడిపోయిన ఉద్యోగుల్లో ఒక వర్గం ఓ అడుగు ముందుకేసి ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. యూనిట్ పరిధిలో పని చేస్తే ఉద్యోగల సమస్యలను పరిష్కరిస్తామని...సొసైటీ ఏర్పాటు చేసి ఉద్యోగులకు ప్రభుత్వ ధరకే కొనుగోలు చేసి కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తామంటున్నారు. జడ్పీలో లిఫ్టు ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించారు.

ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలి

● ఆన్‌లైన్ ద్వారా స్వీకరణ ● కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 3: సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్-2025 అవార్డుకు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు అందించిన అమూల్యమైన సహకారాన్ని నిస్వార్థ సేవలకు గాను భారత ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేయనున్నదని తెలియజేశారు. ప్రతి సంవత్సరం జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోజు అవార్డును ప్రకటించనున్నారు. Https://awards.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వంట ఏజెన్సీపై అదే రగడ



చికిత్స పొందుతున్న లక్ష్మీబాయి



పాఠశాల వద్ద బందోబస్తు కొచ్చిన పోలీసులు

● ఒకే పార్టీ వ్యక్తుల మధ్య ఘర్షణ ● ఇద్దరు ఆసుపత్రిపాలు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్ట్ 2: పొయ్యిలో మంటలు లేవాల్సిన చోట వ్యక్తుల మధ్య మాట మంటలు లేచాయి. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు వంట ఏజెన్సీ నాకు కావాలంటే నాకు కావాలని ఘర్షణకు దిగారు. ఇద్దరు గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. రెండు రోజుల క్రితం ఆదోని నియోజకవర్గంలోని గనేకల్ గ్రామంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ తనకు కావాలంటే తనకు కావాలని గొడవపడి విద్యార్థులకు భోజనం లేకుండా చేసారు. ఇది మరవక ముందే పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకే పార్టీకి చెందిన వారు ఏజెన్సీ కోసం కొట్టుకున్నారు. ఈ గొడవలో లక్ష్మీబాయి, నాగేష్ గాయాలపాలై ఆసుపత్రిలో చేరారు. ఆర్‌జీ నగర్‌కు చెందని బీజేపీ కార్యకర్త మహేష్ నాయక్ కుటుంబానికి చెందిన అంజలి డ్వాక్రా ఏజెన్సీ లక్ష్మీబాయి మధ్యాహ్న భోజన పథకం వంట చేయాలని త్రీ మెన్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసారు. ఈమేరకు శుక్రవారం వంట చేయడానికి ఆమె వచ్చింది. అయితే గతంలో ఇందిరా గ్రూపులోని పార్వతి అనే మహిళ వంట చేస్తుం డేది. ఆమె భర్త నాగేష్ అప్పట్లో వైసీపీలో ఉండేవాడు. ప్రభుత్వం మారాక ఆయన ఇటీవలే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నాడు. తమకు వంట ఏజెన్సీ ఇవ్వాలని ఈ దంపతులు ఎమ్మెల్యేను అడిగారు. దీంతో ఎమ్మెల్యే లక్ష్మీబాయితో కలిసి పంట పని చూడమని చెప్పారు. ఈ నేపథ్యంలో లక్ష్మీబాయి, నాగేష్ మధ్య ఘర్షణ జరిగింది. లక్ష్మీబాయి మీద భౌతిక దాడికి పాల్పడ్డారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఈ గొడవను పసిగట్టి ముందురోజే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి ఇరువురిని అదుపు చేశారు. ఎట్టకేలకు పాత ఏజెన్సీ విరమించుకుంటామని ప్రధానోపాధ్యాయుడుకు తెలియజేసారు. గాయపడిన లక్ష్మీబాయి, నాగేష్‌లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, రమాకాంత్ పరామర్శించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కోడుమూరు (రూరల్), ఆగస్టు 3: మండలంలోని అనుగొండలో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన సుంకన్న (46) అనే రైతు శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుంకన్నకు 3 ఎకరాల పొలం ఉంది. పత్తి, కూరగాయలు సాగు చేస్తున్నాడు. అయితే పంటల సాగులో కలిసిరాక సుమారు రూ. 9 లక్షల అప్పులపాలయ్యాయి. ఏటేటా నష్టాలు రావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భార్యాపిల్లలు దుఃఖసాగరంలో మునిగిపోయారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు సుంకన్నకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 3: మండలంలోని కొత్తూరు వద్ద శనివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కొత్తూరు గ్రామ సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో వెనుక బైక్‌పై వెళుతున్న యువతి, యువకుడు కిందపడి తీవ్ర గాయపడ్డారు. ముందు బైక్‌పై వెళుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. వారిలో యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే గాయపడిన వారు ఎవరు ? ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారనే వివరాలు తెలియరాలేదు. ఎస్‌ఐ బాలనరసింహులు మాట్లాడుతూ ప్రమాద ఘటనపై వివరాలు ఆరా తీస్తున్నామని అన్నారు.

64 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 3: రాయలసీమ రేంజ్ పరిధిలో కర్నూలు, అన్నమయ్య, నంద్యాల, వైఎస్సార్ కడప, అనంతపురం రేంజ్ పరిధిలో 64 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.చంద్రబాబు నాయుడు	డీటీసీ, నంద్యాల	కర్నూలు రూరల్ సర్కిల్
వి.కిరణ్ కుమార్ రెడ్డి	కర్నూలు రూరల్ సర్కిల్	వీఆర్ ఎస్‌పీ, కర్నూలు
జి.సుబ్బారావు	బనగానపల్లె యుపీఎస్, నంద్యాల	దేవనకొండ యుపీఎస్, కర్నూలు
కుచల శ్రీనివాసులు	దేవనకొండ యుపీఎస్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ కర్నూలు
ఎన్.అశోక్ కుమార్	రైల్వేస్ (ఆన్ రిపాట్రిషన్)	కౌతాళం యుపీఎస్, కర్నూలు (న్యూ మంత్రాలయం టూరిస్ట్ ఓపీ పోస్టు)
సి.నల్లప్ప	పాణ్యం సర్కిల్, నంద్యాల	ఆదోని రూరల్ సర్కిల్, కర్నూలు
జి.నిరంజన్ రెడ్డి	ఆదోని రూరల్ సర్కిల్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
పి.రామలింగయ్య	వీఆర్ఎస్‌పీ, కర్నూలు	ఆదోని త్రీటౌన్ యూపీఎస్, కర్నూలు
పి.నరసింహ రాజు	ఆదోని త్రీటౌన్ యూపీఎస్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
ఎస్‌కే చాంద్‌బాషా	వేంపల్లి యుజీ పీఎస్, వైఎస్సార్ కడప	పత్తికొండ సర్కిల్, కర్నూలు
జి.ఇంతియాజ్ బాషా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు	డోన్ టౌన్, యూపీఎస్, నంద్యాల
బి.మధుసూదన్‌రావు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు	వెల్దుర్తి సర్కిల్, కర్నూలు
ఎం.సురేష్ కుమార్ రెడ్డి	వెల్దుర్తి సర్కిల్, కర్నూలు	వీఆర్ఎస్‌పి, కర్నూలు
కె.ప్రవీణ్ కుమార్	డోన్ టౌన్, యూపీఎస్, నంద్యాల	సీసీఎస్, కర్నూలు
ఎ.జయన్న	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు	పత్తికొండ అర్బన్ యూపీఎస్, కర్నూలు
కె.మురళీ మోహన్	పత్తికొండ అర్బన్, యూపీఎస్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ కర్నూలు
ఎం.యుగంధర్	ప్రొద్దుటూరు ట్రాఫిక్, వైఎస్సార్ కడప	ప్రొద్దుటూరు టూటౌన్ యుపీఎస్, వైఎస్సార్ కడప
జి.అబ్దుల్ కరీమ్	ప్రొద్దుటూరు టూటౌన్ యుపీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
ఎస్.చిరంజీవి	పోరుమామిళ్ల సర్కిల్, నంద్యాల	ఆళ్లగడ్డ టౌన్ యూపీఎస్, నంద్యాల
ఎం.రమేష్‌బాబు	ఆళ్లగడ్డ టౌన్ యుపీఎస్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
కంబగిరి రాముడు	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు, వైఎస్సార్ కడప	ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్, నంద్యాల
పి.హనుమంత నాయక్	ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
బీవీ విక్రమ్ సింహ	బద్వేల్ రూరల్ సర్కిల్, వైఎస్సార్ కడప	ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్, కర్నూలు
కె.మోహన్ రెడ్డి	ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
బి.రామకృష్ణ రెడ్డి	కమలాపురం సర్కిల్, వైఎస్సార్ కడప	ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్, వైఎస్సార్ కడప
ఎ.సురేష్ రెడ్డి	పులివెందుల ట్రాఫిక్, వైఎస్సార్ కడప	వేంపల్లి యుపీఎస్, వైఎస్సార్ కడప
పి.మహ్మద్ రఫి	సీసీఎస్, అన్నమయ్య	కొండాపురం సర్కిల్, వైఎస్సార్ కడప
వి.వేణుగోపాల్	కొండాపురం సర్కిల్, వైఎస్సార్ కడప	వీఆర్ఎస్‌పీ, కడప
ఎ.మోహన్ కుమార్	వీఆర్ఎస్‌పీ, కడప	ఒంటిమిట్ట సర్కిల్, వైఎస్సార్ కడప
ఆర్.పురుషోత్తంరాజు	ఒంటిమిట్ట సర్కిల్, వైఎస్సార్ కడప	వీఆర్ఎస్‌పీ, కడప
డి.రామాంజులు	వీఆర్, రేంజ్ కార్యాలయం, కర్నూలు	మన్నూరు యుపీఎస్, అన్నమయ్య
ఎన్.రవీంద్రనాథ్	మన్నూరు యుపీఎస్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ, అన్నమయ్య
ఎం.రాజగోపాల్	పాకల యుపీఎస్, తిరుపతి జిల్లా	బద్వేల్ యుపీఎస్, వైఎస్సార్ కడప
పి.యుగంధర్	బద్వేల్ యుపీఎస్, వైఎస్సార్ కడప	పీలేరు సర్కిల్, అన్నమయ్య
ఎన్.మోహన్ రెడ్డి	పీలేరు సర్కిల్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ, అన్నమయ్య
ఎం.నాగభూషణం	ఆత్మకూరు సర్కిల్, నంద్యాల	బద్వేల్ రూరల్ సర్కిల్, వైఎస్సార్ కడప
జె.ప్రసాద్‌బాబు	రాయదుర్గ్ రూరల్, అనంతపురం	వోయలపాడు సర్కిల్, అన్నమయ్య
పి.పులిశేఖర్	వోయలపాడు సర్కిల్, అన్నమయ్య	మదనపల్లి తాలుకా యుపీఎస్, అన్నమయ్య
ఎన్.శేఖర్	మదనపల్లి తాలుకా యుపీఎస్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ అన్నమయ్య
ఎ.చాంద్‌బాషా	ఎస్సీ, ఎస్టీ సెల్-1 తిరుపతి	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య
యు.వలి బాషు	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ అన్నమయ్య
కె.రెడ్డి శేఖర్ రెడ్డి	సీసీఎస్ తిరుమల, తిరుపతి	కలికిరి సర్కిల్, అన్నమయ్య
ఆర్.మోహన్	కలికిరి సర్కిల్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పి అన్నమయ్య
ఎస్ గురునాథ్	ఇంటెలిజెన్స్ (ఆన్ రిపాట్రిషన్)	కలకాడ, అన్నమయ్య
డి.శ్రీనివాసులు	కలకాడ, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ అన్నమయ్య
కె. రమేష్	వీఆర్ఎస్‌పీ కర్నూలు	మదనపల్లి రూరల్ సర్కిల్, అన్నమయ్య
యు.సద్గురుడు	మదనపల్లి రూరల్ సర్కిల్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ, అన్నమయ్య
కె.హేమసుందర్‌రావు	రైల్వేస్ (ఆన్ రిపాట్రిషన్)	రైల్వేకోడూరు యుపీఎస్, అన్నమయ్య
పి.సురేంద్రనాథ్ రెడ్డి	రైల్వేకోడూరు యుపీఎస్ అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ, అన్నమయ్య
వి. చిన్న పెద్దయ్య	శ్రీసిటి, తిరుపతి	సీసీఎస్, అన్నమయ్య
బి.మల్లికార్జున గుప్త	వీఆర్, అన్నమయ్య	డీసీఆర్‌బీ, అన్నమయ్య
పసుపులేటి రామకృష్ణ	సీసీఎస్-3, తిరుపతి	డీఎస్‌బీ, అన్నమయ్య
జి.సుధాకర్ రెడ్డి	వీఆర్ఎస్‌పి, నంద్యాల	నంద్యాల వన్‌టౌన్ పీఎస్, నంద్యాల
బి.మల్లికార్జున గుప్త	వీఆర్, అన్నమయ్య	నంద్యాల ట్రాఫిక్ పీఎస్, నంద్యాల
ఎం.మంజునాథ రెడ్డి	సీసీఎస్, నంద్యాల	బనగానపల్లె రూరల్ సర్కిల్, నంద్యాల
ఎం.రమేష్‌బాబు	వీఆర్ఎస్‌పి, నంద్యాల	కొలిమిగుండ్ల యుపీఎస్, నంద్యాల
పి.హనుమంత నాయక్	వీఆర్ఎస్‌పీ, నంద్యాల	కోయలకుంట్ల సర్కిల్, నంద్యాల
వీ.సీతారామిరెడ్డి	ట్రాఫిక్, కడప	రిమ్స్, వైఎస్సార్ కడప
ఏ.గోవిందరెడ్డి	ఆర్‌కే వ్యాలి సర్కిల్	ప్రొద్దుటూరు అర్బన్ (త్రీటౌన్), వైఎస్సార్ కడప
పి.వంశినాథ్	ఏసీబీ (ఆన్ రిపాట్రిషన్)	దేవనకొండ యుపీఎస్, కర్నూలు
జి.సుబ్బారావు	బనగానపల్లె యుపీఎస్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
ఎస్‌కే చాంద్‌బాషా	వేంపల్లి యుపీ పీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
పి.పులిశేఖర్	వీఆర్ఎస్‌పీ అన్నమయ్య	పత్తికొండ సర్కిల్, కర్నూలు
టి.బాబు	రైల్వే కోడూరు యుపీఎస్, అన్నమయ్య	వీఆర్ఎస్‌పీ, అన్నమయ్య

5న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 3: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 5వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జి సిమ్‌కు అప్‌గ్రేడ్ చేసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 3: ఉచితంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్‌కు అప్‌గ్రేడ్ చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా(ఉమ్మడి జిల్లాలు) జనరల్ మేనేజర్ జి .రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 400 సెల్ టవర్ల ద్వారా 4జీ సేవలను దశల వారీగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ ఉచిత 4జీ సిమ్‌లు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీసు సెంటర్లు, ఫ్రాంచేజీలు, రిటైలర్లు, ఏజెంట్ల ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

శిరివెళ్ల, ఆగస్టు 3 : మండలంలోని గుంప్రమాన్‌దిన్నె మజరా గ్రామమైన రాజనగరానికి చెందిన దాసరి భూమిక(20) అనుమానాస్పదంగా మృతి చెంది న ట్లు ఎస్‌ఐ సురేష్ శనివారం తెలిపారు. రాజనగరానికి చెందిన చెరుకూరి ఈశ్వర ప్రసాద్, భూమిక దంపతులు ఏలూరు జిల్లా దెందులూరు మండలం కోవలి గ్రామంలో నివసించేవారు. గత నెల 31వ తేదీ అర్ధరాత్రి కోవలిలోని తన స్వగృహంలో భూమిక ఉరేసుకుంది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన రాజనగరానికి తీసుకు వచ్చారు. తమ కుమార్తె భూమిక మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి దాసరి రామదాసు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు జాతీయ స్నేహితుల దినోత్సవం



ఆత్మకూరు, ఆగస్టు 3: జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం జరుపుకోవడానికి స్నేహితులు సిద్ధమయ్యారు. ఈ రోజున స్నేహితులు తమ స్నేహానికి గుర్తుండిపోయేలా సంబరాలు చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రస్తుత ట్రెండ్‌లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ చేతికి కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు.

స్నేహితుల దినోత్సవం జరుపుకోవడానికి కారణం

అమెరికా ప్రభుత్వం 1935 ఆగస్టు మొదటి శనివారం ఓ వ్యక్తికి మరణశిక్ష విధించింది. అతని మరణవార్త విని ఆ మరుసటి రోజే అతని స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన అమెరికా ప్రభుత్వం వీరి స్నేహానికి గుర్తుగా అప్పటి నుంచి ఆగస్టు మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. ఆ దేశంలో ఏటా ఈ దినోత్సవాన్ని స్నేహితులందరూ ఎంతో సంతోషంగా జరుపుకొంటారు. అయితే చాలా దేశాలు జూలై 30వ తేదీని స్నేహితుల దినోత్సవంగా జరుపుకొనగా మనదేశంలో మాత్రం ఆగస్టు మొదటి ఆదివారాన్నే స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదిలావుంటే మహిళా స్నేహితుల దినోత్సవం మనదేశంలో సెప్టెంబరు 3వ తేదీన జరుపుతారు. అంతర్జాతీయ స్నేహమాసంగా ఫిబ్రవరి నెలను నిర్ణయించారు.

టీడీపీలో చేరిక



బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎర్రగూడూరు వైసీపీ నాయకుడు బాలీశ్వరరెడ్డి, తదితరులు

పాములపాడు, ఆగస్టు 3: మండలంలోని ఎర్రగూడూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బాలీశ్వరరెడ్డి తన అనుచరవర్గం అయిన క్రిష్ణానగర్ గ్రామం పీరయ్య, లింగాల గ్రామం జంబులయ్య ఆధ్వర్యంలో వంద కుటుంబాలు పైగా నందికొట్కూరులో బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాట. వీరికి బైరెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, రమేశ్, కరుణాకరరెడ్డి, మల్లికార్జున యాదవ్, గుణశేఖరరెడ్డి, పి.జంబులయ్య, రవి, సామేలు, సుంకన్న, రత్నం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలకు సీఎం చిత్రపటాలు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను అందిస్తున్న నాయకులు

పాణ్యం, ఆగస్టు 3: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలను శనివారం జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సచివాలయాలకు అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల ఫొటోలను ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో జాప్యం ఏర్పడటంతో స్పందించిన టీడీపీ నాయకులు వారి చిత్రపటాలను అందజేసినట్లు తెలిపారు. పాణ్యంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటు సచివాలయాలకు ముఖ్యమంత్రుల చిత్రపటాలను అందజేశారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఈవోఆర్డీ సులోచన, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సచివాలయ కార్యదర్శులు శివకుమార్, రవి, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కృష్ణ, రవి, సుబ్బయ్య ఉన్నారు.

'మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు'

కొత్తపల్లి, ఆగస్టు 3: ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి భారీ ఎత్తున వరద కొనసాగుతోందని, వరద తగ్గే దాకా మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని కొత్తపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ పెద్దన్న సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గ్రామ సేవకులతో పెద్దన్న సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సంగమేశ్వరం, సిద్దేశ్వరం, చీమలతిప్ప, సోమశిల, పరిసర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సేవకులకు సూచించారు. శ్రీశైలం రిజర్వాయరుకు 4 లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున వరద కొనసాగుతున్నందున మరబోట్ల నిర్వాహకులు కూడా వరద తగ్గే వరకు మరబోట్లు తిప్పకుండా చూడాలన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 3: నందికొట్కూరు పట్టణ నూతన సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డిని మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. వైస్ చైర్మన్ పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీఐని శాలువాతో సన్మానించారు. 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్,14వ వార్డు కౌన్సిలర మానపటి అశోక్, 4, 5, 6, 8, 13, 26వ వార్డు ఇన్‌చార్జిలు బోయ శేఖర్, సన అబ్దుల్లా, దేశెట్టి శ్రీనివసులు, శాలిబాషా, రమేష్, మందటి రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

అవయవ దానంపై ప్రజలను చైతన్యం చేయాలి: డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో పద్మజ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 3: అవయవదానంపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు యువత నడుంబిగించాలని డీఆర్వో పద్మజ పిలుపునిచ్చారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్వోతో పాటు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా సీనియర్ వైద్యులు, ఐఎంఏ నాయకులు డ్టార్ గెలివి సహదేవుడు, ఐఎంఎ అధ్యక్షురాలు డాక్టర్ వసుధరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అవయవదానంపై అంగీకార పత్రాలను విడుదల చేశారు. డీఆర్వో మాట్లాడుతూ యువత సామాజిక దృక్పథం కలిగి ఉండాలని, అవయవ దానంపై సమాజాన్ని చైతన్య పరిచే విధంగా కృషి చేయాలని అన్నారు. నేత్రదానంతో ఇద్దరికి చూపు వస్తుందని, అవయవ దానం ద్వారా ఎనిమిది మందికి కొత్త జీవితాలను ప్రసాదించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అవయవదానంతోపాటు కణజాలం కూడా అవసరమైన వారికి దానం చేసి ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. జిల్లాలో నేత్రదానం, అవయవదానం చేయాలనుకున్న వారు రెడ్‌క్రాస్ సంస్థను సంరదించాలని ఆ సంస్థ జిల్లా చైర్మన్ దస్తగిరి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, యోగా గురువు ఆనంద్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ రామలింగారెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

'ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి'



రోళ్లపాడులో ఆయిల్ పామ్ మొక్కను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నాగరాజు

మిడుతూరు, ఆగస్టు 3: ఆయిల్ పామ్ సాగుకు నీటి సౌకర్యం ఉన్న రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు సూచించారు. రోళ్లపాడు గ్రామం నందు ఆయిల్ పామ్ సాగును శనివారం సందర్శించారు. అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేయు రైతులకు ఒక హెక్టారుకు రూ.29,000 ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చన్నారు. అదేవిధంగా ఉద్యాన అంతర పంటలు వేసుకొనేందుకు ఒక హెక్టారుకు ఏడాదికి రూ.5500 అందించనున్నట్లు తెలి పారు. ఆయిల్ పామ్ సాగు చేయు ఆసక్తిగల రైతులు ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం రైతు పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు.మండల ఉద్యాన అధికారి తేజస్విని, వీహెచ్‌ఏ ప్రత్యూష, ఎంపీఈవో కిషోర్, రైతులు పాల్గొన్నారు.

వంతెనపై నుంచి రాకపోకలు

- హంద్రీ నీవా కాలువపై డైవర్షన్ రోడ్డు తొలగింపు

నందికొట్కూరు, ఆగస్టు 3: కర్నూలు-నందికొట్కూరుకు వెళ్లే 340-సి జాతీయ రహదారి సమస్యకు అధికారులు ఎట్టకేలకు పరిష్కారం చూపారు. గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు మధ్యలో ఉన్న హంద్రీనీవా కాలువపై 340-సి జాతీయ రహదారి వెళ్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ నిర్మిస్తున్న వంతెన వల్ల కాలువను పూడ్చి డైవర్షన్ ఇచ్చారు. దీంతో మూడు జిల్లాలకు ప్రధానమైన హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువకు నీటిని వదిలేందుకు ఆలస్యమవుతోందని ఆంధ్రజ్యోతి ఇచ్చి కథనంతో మంత్రులు, అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో పైపులైన్ ఏర్పాటు చేసి వాటిపైన రోడ్డును ముందున్న రోడ్డును తొలగించారు. అయితే శుక్రవారం పైపులైన్ ప్రమాదంగా మారడంతో అధికారులు అప్రమత్తమై ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించారు. గార్గేయపురం, మిడ్తూరు మీదుగా నందికొట్కూరు రాకపోకలు సాగించాలని యోచించారు. కానీ కడమూరు గ్రామంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్న ఉద్దేశంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. వంతెన నిర్మించి 14 రోజులు దాటడంతో వంతెనపై వాహనాలు వెళ్లేందుకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ క్వాలిటీ కన్సల్టెన్సీ అధికారులు క్లియరెన్స్ ఇవ్వడంతో రాకపోకలు సాగుతున్నాయి. దీంతో హంద్రీనీవాలో వేసిన పైల్‌లైన్‌ను తొలగించి నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువ నిండుగా ప్రవహించింది.

'పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి'

కొత్తపల్లి, ఆగస్టు 3: వివిధ సమస్యలపై ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వస్తే పోలీసులు జవాబుదారిగా ఉండాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్, సిబ్బందికి సూచించారు. శనివారం సీఐ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌కు వచ్చే రోజువారి ఫిర్యాదులను, వివిధ కేసులకు సంబంధించిన పూర్వపరాలను ఎస్‌ఐని అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ రికార్డులను పరిశీలించి, పరిసరాలు తనిఖీ చేసి ఎస్‌ఐకి సూచించారు. స్టేషన్‌కు వచ్చేవారి పట్ల పోలీసులు ఫ్రెండ్లీగా ఉండి సహాయ సహకారాలు అందించాలన్నారు.

ఐఎల్‌ఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఐఎల్‌ఏ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

నంద్యాల క్రైం, ఆగస్టు 3: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) నంద్యాల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నంద్యాలలోని రెవెన్యూ నిశాంత్ భవన్‌లో శనివారం ఐఎల్‌ఏ రాష్ట్ర ప్రెసిడెంట్ జి.శాంతకుమార్, రాష్ట్ర నాయకులు ఎ.బ్రహ్మేశ్వరరావు, పి.నరసింహుడు, ఐఎల్‌ఏ రాయలసీమ ఉమ్మడి జిల్లాల బాధ్యుడు బండారి చంద్రుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐఎల్‌ఏ సమావేశంలో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎం.తిరుపతి, అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కడియం సాంబశివుడు, ఎస్.షాజహాన్, ప్రధాన కార్యదర్శిగా డి.చిన్నలింగమయ్య, సహాయ కార్యదర్శులుగా వనం శ్రీనివాసులు, పి.పాములేటి, కోశాధికారిగా బాలునాయక్ ఎన్నికయ్యారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలు రాజ్యాంగబద్ధమేనా? అన్న అంశంపై వక్తలు చర్చించారు. కార్యక్రమంలో పలువురు ఐఎల్‌ఏ సభ్యులు, నంద్యాల న్యాయవాదులు పాల్గొన్నారు.

20 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, ఆగస్టు 3: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 20వ తేదీ వరకు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఇంగ్లీష్/తెలుగు మీడియం, హెచ్‌ఈసీ ఉర్దూ మీడియం ఉందని తెలిపారు. ఒకేషనల్ కోర్సులు.. ఎంఅండ్‌ఏఈ, సీఎస్‌ఈ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)-, సీపీఅండ్‌ఎం, బీఅండ్‌ఆర్‌ఎం ఉన్నారని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

ఎస్‌డీఆర్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 3: నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామంలో ఉన్న ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్‌కు పాఠశాలల ఆర్జేడీ శ్యామ్యూల్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో సుధాకరరెడ్డి శనివారం తెలిపారు. ఎస్డీఆర్ పాఠశాలలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు శుక్రవారం ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురై వాంతులు విరేచనాలు అయిన విషయం తెలిసిందే. అయితే జరిగిన ఘటనను పాఠశాల యాజమాన్యం బయటకు పొక్కకుండా ఉండేందుకు గోప్యంగా వ్యవహరించి నంద్యాలలోని ప్రముఖ ఆసుపత్రుల నుంచి వైద్యులను పాఠశాలకే పిలుపించుకుని చికిత్స అందించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ ఈవో మహబూబ్‌బేగ్ నంద్యాల ఎంఈవో బ్రహ్మం, తాలూకా పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పాఠశాలకు తనిఖీకి వెళ్లారు. ఘటనపై అధికారులను, మీడియాను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడంతో అధికారులకు అనుమానాలు రేకెత్తాంచాయి. విద్యార్థుల హాస్టళ్లోకి వెళ్లివిద్యార్థులను విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరు, హాస్టల్‌లో వసతలు సరిగా లేకపోవడం, జరిగిన ఘటనను గోప్యంగా ఉంచి వ్యవహరించిన వైనం తదితర విషయాలను కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో పాఠశాలల ఆర్జేడీకి నివేదిక సమర్పించారు. పాఠశాల గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదని జరిగిన ఘటనపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పాఠశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని డీఈవో సుధాకరరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 3: కళారాధన, నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో దేశ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని పోటీలను నిర్వహించారు. శనివారం వివేకానంద ఆడిటోరియంలో సబ్ జూనియర్, జూనియర్ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ, జానపద, సాధారణ, దేశభక్తి విభాగాలలో సోలో, బృందగాన పాటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు రాగయుక్తమైన గానాలాపనలతో మాతృభూమికి స్వరార్చన చేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సీతమ్మ, లక్ష్మీకళ్యాణి వ్యవహరించారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవిక్రిష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పోటీలను పర్యవేక్షించారు.

ఉద్యానవన పంటలపై అవగాహన



ఉద్యానవన పంటను పరిశీలిస్తున్న రామచంద్రారెడ్డి

మహానంది, ఆగస్టు 3: నల్లమల సమీపంలో నివసించే చెంచులకు ఉద్యానవన పంటల సాగుపై మరింత అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకుడు రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మహానంది సమీపంలోని చెంచుకాలనీ పరిసరాల్లో చెంచులు సాగు చేస్తున్న వివిధ రకాల ఉద్యావవన పంటలతో పాటు ఉపాధి హామీ పథకం కింద నీటి సంరక్షణ కోసం చేసిన ఫారం పాండ్‌లను ఆయన పరిశీలించారు. ఏపీవో మనోహర్, ఈసీ రామేశ్వరరెడ్డి, సీటీఏ షేక్షావలి, హార్టికల్చరల్ సూపర్‌వైజర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

చెన్నై కాలువకు నీటి విడుదల పెంపు

వెలుగోడు/మహానంది, ఆగస్టు 3: తెలుగుగంగ మెయిన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి చెన్నై కాలువకు మరో రెండు వేల క్యూసెక్కుల నీటిని అదనంగా విడుదల చేసినట్లు తెలుగుగంగ అధికారులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి, తెలుగుగంగ అధికారులు కలిసి మూడు వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ నీటితోపాటు శనివారం మరో రెండు వేల క్యూసెక్కులను పెంచి మొత్తం ఐదు వేల క్యూసెక్కుల నీటిని చెన్నై కాలువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి బానకచెర్ల సముదాయం నుంచి 16 వేల క్యూసెక్కులు, జలాశయం అంతర్భాగంలోని అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి 1150 క్యూసెక్కులు మొత్తం 17,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం మెయిన్ కెనాల్ ద్వారా 5 వేలు, వన్‌ఆర్ తూము ద్వారా 50, వన్‌ఎల్ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని, నంద్యాల తాగునీటి కోసం మరో 15 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు గంగ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 259.02 మీటర్ల వద్ద 8.615 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు వారు వివరించారు. చెన్నై ప్రధాన కాలువలో భారీగా నీరు విడుదల అవుతోందని, రైతులు సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగ అధికారులు కోరారు.

నేడు చౌడేశ్వరీమాత జాతర

ఆత్మకూరు, ఆగస్టు 3: ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో వెలసిన చౌడేశ్వరీ దేవస్థానంలో ఆషాఢమాసం అమావాస్య తిథి, ఆదివారం అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బోనాల జాతరను సంబరంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తెలంగాణ ప్రాంతాల్లో మాత్రమే సంప్రదాయంగా జరిగే బోనాల పండుగలను గత కొన్నేళ్లుగా ఆత్మకూరు పట్టణంలో కూడా కన్నుల పండువగా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. అలాగే తొగటవీర క్షత్రియులు నిర్వహించి జ్యోతుల మహోత్సవ వేడుక వైభవంగా జరగనుంది. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

7న సర్వసభ్య సమావేశం

గోస్పాడు, ఆగస్టు 3: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీన మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగ అనసూయ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల సంబంధించిన అధికారులు పూర్తిస్థాయి నివేదికతో సమావేశానికి హాజరు కావాలని, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

రైతులకు అవసరమైన ఎరువులనే విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ

నంద్యాల టౌన్, ఆగస్టు 3: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని ఎరువుల డీలర్లను జిల్లా వ్యవసాయాధి కారి వైవీ మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం ఎస్ రామకృష్ణారెడ్డి ఎరువుల గోదాముతో పాటు పలు ఎరువులను నిల్వ ఉంచే గోదాములను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గోదాముల్లో నిల్వ వివరాలు, స్టాక్ బుక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఇతర ధ్రువీపత్రాలను పరిశీలించారు. అధికారి మాట్లాడుతూ హ్యాండ్‌లింగ్ ఆపరేటర్లందరూ గోదాముల ప్రకారం, కంపెనీ ప్రకారం స్టాక్ రిజిస్టర్స్ నిర్వహించాలని ఆదేశించారు. కంపెనీ ప్రతినిధులు హోల్ సేల్ దుకాణాల యజమానులు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులను రైతులకు అందించేందుకు కొరత రాకుండా రిటైల్ డీలర్లకు సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని, స్టాక్ రిజిస్టర్, గోదాముల ప్రకారం, గ్రేడ్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నూతన బస్సులు ప్రారంభం



ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 3: నందికొట్కూరు ఆర్టీసీలో నూతనంగా రెండు సూపర్ లగ్జరీ బస్సులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం ఎమ్మెల్యే నందికొట్కూరు నుంచి హైదరాబాదుకు వెళ్లే రెండు సర్వీసుల నూతన బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నందికొట్కూరు డిపోకు ఇంద్ర బస్సులు లేవని తెలియడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి, ఆర్టీసీ చైర్మన్ తీసుకెళ్లామన్నారు. నందికొట్కూరు నుంచి కర్నూలు, విజయవాడకు రెండు సర్వీసులు, నందికొట్కూరు నుంచి బెంగళూరు, తిరుపతికి ఒక్కొక్క సర్వీసును నడపడానికి వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. డిపోలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నందికొట్కూరు క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావలి, లాయర్ జాకీర్, జమీల్, జూపాడుబంగ్లా మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, పోతులపాడు రవి పాల్గొన్నారు.

'మాటల ప్రభుత్వం కాదు..'

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. తాటిపాడు వద్ద ఉన్న జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఒక మోటారు ద్వారా 21 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని అన్నారు. మిగతా మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, ఆ భారం రైతులు భరించలేరని, ప్రభుత్వం ఆదుకోవాలని జలవనరులశాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, శ్రీనివాసులు, పెద్దన్న, సుధాకర్, బాబు, నారాయణరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రఘుయాదవ్, రవికాంత్, బాలమద్దిలేటి, మన్సూర్‌బాషా, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 3: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా ఇచ్చిన తీర్పుపై బేడ బుడగ జంగాల సంఘం నాయకులు జంబులన్న, జమ్మడక్క, మీసాల పుల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం నంద్యాలలోని రామాలయం సమీపంలో బేడ బుడగ జంగాల నాయకులు సమావేశమయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, తాటికొండ నారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. శివశంకర్, శీను, శివమణి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. నంద్యాల పట్టణంలోని న్యాయవాది ఎం.వెంకటేశ్వరుడు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పుల్లన్న, శ్రీనివాసులు, జీవన్‌రాజ్, జగదీష్, సుబ్బయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి'

నందికొట్కూరు, ఆగస్టు 3: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను రద్దు చేయాలంటూ నందికొట్కూరు పట్టణంలో మాలమహానాడు తాలుకా అధ్యక్షుడు ఏసీ నాగేష్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ త్వరలోనే 9 మందితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించి జాతికి జరిగిన అన్యాయంపై అప్పీల్ చేస్తామన్నారు. మాల మహానాడు సీనియర్ నాయకుడు డా.రాజు, జిల్లా నాయకులు అబ్రహం, దేవన్న, పట్టణ కార్యదర్శి మనోహర్, దాసు, ఉదయ్, మురహరి, రాజన్న, సగినెల రమణ, కృపాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

జూపాడుబంగ్లా, ఆగస్టు 3: మండలంలోని మండ్లెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఆటో, మోటారు సైకిల్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పి.లింగాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున నందికొట్కూరుకు వెళ్లి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మల్లికార్జునకు తీవ్ర గాయాయ్యాయి. ఆత్మకూరు వైద్యశాలకు వెళుతున్న వైద్యులు రాయుడు క్షతగాత్రున్ని పరిశీలించి 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఘర్షణ కేసులో నలుగురికి రిమాండ్

మహానంది, ఆగస్టు 3: సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులను శనివారం కోర్టుకు హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. రెండు రోజుల క్రితం కాలనీలో బంగి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటిపై దాడి చేసి వస్తువులతో పాటు బయట ఉన్న కారును ధ్వంసం చేశారు. ఈ కేసులో శ్రీకాంత్, సుంకన్న, శ్యామ్, మహేష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

విద్యుత్ డీఈ బదిలీ

నంద్యాల రూరల్, ఆగస్టు 3: నంద్యాల విద్యుత్‌శాఖ డీఈగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరు డీఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి నంద్యాల విద్యుత్‌శాఖ డీఈగా బదిలీ అయ్యారు. సోమవారం నంద్యాల డీఈగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారని విద్యుత్ అధికారులు చెప్పారు.

'తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం'



10 బొల్లవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాణ్యం, ఆగస్టు 3: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఏసీడీపీవో పద్మావతమ్మ అన్నారు. మండలంలోని సొబ్జహాన్ కొట్టాలలో మహిళలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగసుంకమ్మ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: మండలంలోని 10 బొల్లవరం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 1వ అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. 8,9,10, తరగతి విద్యార్థినులకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శిశు సంరక్షణ, సమాజంలో ఎలా మెలగాలనే విషయాలను వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ. ఎంఎస్‌కే లక్ష్మి, ఏఎన్‌ఎమ్ రాజేశ్వరి, అంగన్ వాడీ టీచర్స్ వెంకటలక్ష్మీ, సైలాజ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వివిధ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలను సూపర్‌వైజర్ పావని పరిశీలించారు. అంగన్‌వాడీ వర్కర్లు శ్రీదేవి, రామతులసి, లక్ష్మీప్రసన్న, లక్ష్మీదేవి, అనూష ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ముష్టపల్లి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్ పవన్‌కుమార్, సీహెచ్‌వో అమ్మద్,ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్ ఇందిరా ప్రభావతి,అంగన్‌వాడి కార్యకర్తలు, 104 సిబ్బంది రవి, ప్రజలు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అవగాహన కల్పించారు.

గోస్పాడు: పసురుపాడు, తేళ్ళపూరి గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కుమారి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలోని జెండా పేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి


బీసీ ఇందిరమ్మకు మొక్కను అందజేస్తున్న ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి సునీత, అధ్యాపకులు

బనగానపల్లె, ఆగస్టు 3: బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ తెలిపారు. శనివారం జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి సునీత బనగానపల్లె పట్టణంలోని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కార్యాలయంలో బీసీ ఇందిరమ్మను కలిశారు. కళాశాల సమస్యలను గురించి బీసీ ఇందిరమ్మకు వివరించారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను మంత్రి బీసీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ


టీఈ కేశన్నగౌడును సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డోన్, ఆగస్టు 3: మాదిగలు నిరంతర పోరాటాల ద్వారానే ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నారని డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో కేశన్నగౌడును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టన్న మాదిగ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరానిగుండ్ల రాముడులు కలిసి అభినందనలు తెలిపారు.

డోన్(రూరల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ డోన్‌లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ ప్రకారం భవిష్యత్తులో నియామకాలు చేపట్టాలని కోరారు. న్యాయవాదులు గార్లపాటి మద్దిలేటి, రవిప్రకాష్, గుండాల శ్యాంసుందర్, బాలమద్దయ్య, నడిపి కుల్లాయి, జీవన్‌బాబు పాల్గొన్నారు.

ప్యాపిలి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో శనివారం మండలంలోని జక్కసానికుంట్ల గ్రామంలో దండోరా నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుందరం, బాలరంగన్న తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న పాతకక్షలు

- కుటుంబంపై మారణాయుధాలతో దాడి
- ముగ్గురికి తీవ్రగాయాలు

ప్యాపిలి, ఆగస్టు 3: గతంలో బోరు తగాదా పాతకక్షలు భగ్గుమన్నాయి. ఓ వర్గం వారు ప్రత్యర్థి కుటుంబంపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం పట్టణంలోని బీసీ కాలనీలో జరిగింది. పట్టణంలోని బీసీ కాలనికి చెందిన పుల్లేం కమలాకర్, పేటా బలరాముడు పొలాలు పక్క పక్కనే ఉన్నాయి. మూడు నెలల క్రితం బోరు విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు, పెద్ద మనుషుల సమక్షలు ఇరువురు రాజీ అయ్యారు. అయితే పాత కక్షలను మనసులో పెట్టుకున్న కమలాకర్, కుటుంబ సభ్యులు బలరాముడు ఇంటిపై కత్తులు, పట్టుడు కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో బలరాముడుకు భార్య రంగమ్మకు, కొడుకు పులిశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కొడుకు పులిశేఖర్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల బంధువులు ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

దళితులపై అక్రమ కేసులు ఎత్తేయాలి


రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్‌ను కలిసిన డోన్ ఎమ్మార్పీఎస్ నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 3: డోన్ మండలం ఇందిరాంపల్లి గ్రామానికి చెందిన బోనాల సురేష్, మాదిగ దావీదులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పులికొండ రాఘవేంద్ర, నరసింహులు, చిన్న అంజి, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాంపల్లి గ్రామ పొలం వివాదంలో కొందరు బోనాల సురేష్, దావీదులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారికి రక్షణ కల్పించాలని కోరారు.

సమస్యలు మా దృష్టికి తీసుకు రావాలి

డోన్(రూరల్), ఆగస్టు 3: సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు డోన్ ఎమ్మెల్యే కోట్లని కలిశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వారు అందిస్తున్న మెనూ, వసతుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాధితుడికి ఆర్థిక సాయం

డోన్(రూరల్), ఆగస్టు 3: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి ఏపీ వాల్మీకి బోయ పోరాట సమితి కర్నూలు జిల్లా వింగ్ ప్రెసిడెంటు నల్లబోతుల సురేష్ రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. గత నెల 29న సిమెంటునగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్ పట్టణానికి చెందిన సురేంద్ర తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డోన్ మండలం మల్యాల గ్రామ నివాసి ఏపీ వాల్మీకి బోయ పోరాట సమితి కర్నూలు జిల్లా వింగ్ ప్రెసిడెంటు నల్లబోతుల సురేష్ బాధితుడిని పరామర్శించి రూ.11వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు

సంజామల, ఆగస్టు 3: ఒకరు సాగు చేసుకుంటున్న భూమిని మరొకరు ఆక్రమించుకొని దాడికి పాల్పడిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎ.ఎస్.ఐ నాగరాజు శనివారం తెలిపారు. గిద్దలూరు గ్రామానికి చెందిన మద్దిరాల పెద్ద తిరుపాలు గ్రామంలోని సర్వే నెంబరు 184లో ఎ. 1.03సెంట్లు సాగులో ఉన్నాడు. ఈ పొలం పక్కనే ఉన్న బండారు శ్రీరాములుకు 1.03సెంట్ల పొలం ఉంది అయితే తిరుపాలు ఈ పొలాన్ని ఆక్రమించుకున్నాడు. శనివారం ఉదయం తిరుపాలు అతని కొడుకు శ్రీకాంత్ పొలానికి వెళ్లి భూసార పరీక్ష నిమిత్తం మట్టిని తీస్తుండగా అక్కడే ఉన్న శ్రీరాములు రాళ్లతో దాడి చేశారు. శ్రీరాములు కుమారుడు సంగీత్, శ్రీరాముల బావమరిది వెంకటేశ్వర్లు గాయపరిచారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పనే చంద్రబాబు లక్ష్యం

డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఆగస్టు 3: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయిశ్రీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు తొలి సంతకంతో మెగా డీఎస్సీని విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టీడీపీ విధానమని, ఆ దిశగా సీఎం చంద్రబాబు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కూతురు కోట్ల చిత్రమ్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మర్రి మణి, ఎరుకుల చెరువు శివ, ఎల్లా గౌడ్, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డే మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన : ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. స్థానిక సాయిశ్రీ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వందల మంది నిరుద్యోగ యువత తరలివచ్చారు. ఆయా కంపెనీలలో అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట: కోట్ల సుజాతమ్మ


కోట్ల సుజాతమ్మకు పూలబొకే అందజేస్తున్న బీజేపీ నాయకులు

డోన్, ఆగస్టు 3: సీఎం చంద్రబాబు పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని కోట్ల నివాసంలో బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కోట్ల సుజాతమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూటమి ప్రభుత్వం నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం డోన్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈసందర్భంగా మహారాజ్ కోరారు. కోట్ల సుజాతమ్మను కలిసిన వారిలో బీజేపీ నాయకులు ఏసీ మద్దిలేటి, అశోక్, దామోదర్ నాయుడు, ఆంజనేయులు ఉన్నారు.

తెలుగుగంగ ప్రధాన కాలువకు నీటి విడుదల


తెలుగుగంగ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

రుద్రవరం, ఆగస్టు 3: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి ఐదువేల క్యూసెక్కుల నీటిని తెలుగుగంగ ప్రధాన కాలువ (చెన్నై కాలువ)కు విడుదల చేసినట్లు ఏఈ రామశేష శనివారం తెలిపారు. రుద్రవరం ప్రాంతానికి తెలుగుగంగ నీరు చేరింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15 తరువాత తెలుగుగంగ ప్రధాన కాలువకు అధికారులు నీటిని విడుదల చేసేవారు. ఈ సారి ముందస్తు నీటి విడుదల చేశారు. రైతులు తెలుగుగంగ ఆయకట్టు భూముల్లో సాగుకు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మొక్కజొన్న, కంది పంటలు సాగు చేశారు. వరి పంట సాగు చేయడానికి ముందుకు సాగుతున్నారు.

- వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి చెన్నై కాలువ ద్వారా కడప జిల్లాలోని బ్రహ్మంసాగర్‌కు నీరు చేరవేయాలనే లక్ష్యం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. బ్లాక్ చానళ్ల తూములన్నీ కిందకు దించేశారు. గంగ కాలువ గట్టు వెంట అధికారుల పహారా కొనసాగుతోంది. తుండ్లవాగు రిజర్వాయర్ నింపిన వెంటనే బ్రహ్మంసాగర్‌కు నీటిని విడుదల చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

కుందూలో పెరిగిన నీటి ఉధృతి


రాజోలి ఆనకట్ట వద్ద కుందూలో ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, ఆగస్టు 3: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది ఉధృతి శనివారం పెరిగింది. కృష్ణా జలాలు రాజోలి ఆనకట్టకు చేరుకోవడంతో నీటి మట్టం పెరిగిందని, 8 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట నుంచి చాపాడు చానల్‌కు 200 క్యూసెక్కుల నీరు, కేసీ ప్రధాన కాలువకు 900 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకుం టామన్నారు. తుంగభద్రలో 100 టీఎంసీల నీరు నిల్వ ఉందని, శ్రీశైలం రిజర్వాయర్‌లో 885 అడుగుల నీటి మట్టం ఉందని అన్నారు. బనకచర్ల నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు కుందూకి విడుదల చేయడంతో కుందూ నీటి ప్రవాహం పెరిగిందని అన్నారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అనూరాధ

చాగలమర్రి, ఆగస్టు 3: మండలంలోని మల్లేవేముల, బుగ్గవీధి ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో అనూరాధ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధురి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

పక్షుల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల, ఆగస్టు 3: కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల డిగ్రీ కళాశాలలో పక్షుల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సుల వల్ల అదనపు ప్రయోజనాలు ఉంటాయని, ఉద్యోగావకాశాలు మరింత మెరుగవుతాయని అన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకుడు ఎస్.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి పక్షుల సంరక్షణపై కోర్సు ప్రారంభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, క్రిష్ణదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.1.29 లక్షలు

బేతంచెర్ల, ఆగస్టు 3: ఆర్‌ఎస్ రంగాపురంలోని మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్ర ఆదాయం రూ.1.29 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.1,29,965 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

'చంద్రబాబుతో ప్రజలకు భరోసా'

చాగలమర్రి, ఆగస్టు 3: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ప్రజలకు భరోసా కలిగిందని సమాజ సేవకుడు మర్రిపల్లె అబ్దుల్‌గఫార్ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలో ఆటో ద్వార ప్రజలకు అవగాహన కల్పిస్తూ యాత్ర కొనసాగించారు. ఈ యాత్రకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, హమాలీ యూనియన్ సభ్యులు స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల కోసం రూ.4 వేలు పింఛన్ పథకం ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి


నట్లకొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు

సంజామల, ఆగస్టు 3: బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాస్ కోరారు. శనివారం నట్లకొత్తూరు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆధర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల స్వచ్ఛతను గురించి బాలింతలకు, గర్భిణులకు తెలియజేశారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో దొరికే పోషక విలువలతో కూడిన వస్తువులను తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఎ.ఎన్.ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఏఎన్‌ఎం బి.నారాయణమ్మ తెలిపారు. శనివారం మండలంలోని కంపమల్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త హిమబిందు, వెంకటలక్ష్మీ, ఎడబ్ల్యూఎస్ లక్ష్మీదేవి, సావిత్రి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


బేతంచెర్లలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నగేష్


బనగానపల్లెలో..

బేతంచెర్ల, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీ యూ ఆధ్వర్యంలో కొద్దిసేపు వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలపై నిరంకుశ వైఖరి అవలంబిస్తూ రాత్రి డ్యూటీలను నిలుపుదల చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు ఎస్‌కేబాషా ప్రధాన కార్య దర్శి మహేశ్వరమ్మ, నాగలక్ష్మి, బాలయ్య, మునయ్య, తిమ్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బనగానపల్లె: తమ డిమాండ్లు నెరవేర్చాలని వీఆర్‌ఏలు బనగానపల్లె తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్, సీఐ టీయూ నాయకుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఎంఈవో


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్

కొలిమిగుండ్ల, ఆగస్టు 3: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో అబ్దుల్‌కలాం అన్నారు. శనివారం కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన విద్యార్థులకు పంపిణీ చేశారు. అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, బాల ఓబన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం.. నలుగురికి గాయాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 3: మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. రహదారుల్లో తిరిగే పలువురు వ్యక్తులపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన ఓబులేసు, భారతమ్మ, రామిరెడ్డితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో బాధితులు కొలిమి గుండ్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకొని టీకాలు వేయించుకున్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు.

చిన్నవంగలిలో 35 మట్టిమిద్దెలు

చాగలమర్రి, ఆగస్టు 3: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దెలో నివాసం ఉంటూ ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో కలెక్టర్, డీపీవో స్పందించి గ్రామంలో మట్టిమిద్దెల సర్వే చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి నాగార్జున, ఇంజనీరింగ్ సహాయకులు గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 35 గృహాలు ఉన్నట్లు గుర్తించారు. అందులో 15 గృహాల్లో జీవనం చేయడం లేదని చెప్పారు.

8న స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నిక

కోవెలకుంట్ల, ఆగస్టు 3: స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లల్లో మేనేజ్‌మెంటు షెడ్యూలు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ఈనెల 1న స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నోటీసు బోర్డులో ఎన్నికల జాబితాను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

క్రీడాకారుడికి రామ్‌కో ఆర్థిక సాయం

కొలిమిగుండ్ల, ఆగస్టు 3: జాతీయ క్రీడల్లో రాణిస్తున్న జంప్ రోప్ క్రీడాకారుడికి రూ.30వేల నగదు అందించినట్లు రామ్‌కో సిమెంటు పరిశ్రమ యూనిట్ హెడ్‌రెడ్డి నాగరాజు తెలిపారు. శనివారం రామ్‌కో పరిశ్రమ కార్యాలయంలో నంద్యాలకు చెందిన జంప్ రోప్ క్రీడాకారుడు రుశిక్ నాగేష్‌కు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, జీఎం రవికు మార్, మేనేజర్ అఖిల్, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

256 కుష్ఠు వ్యాధి అనుమానిత కేసులు

చాగలమర్రి, ఆగస్టు 3: మండలంలో కుష్ఠువ్యాధి సర్వేలో 256 అనుమానిత కేసులు నమోదైనట్లు నోడల్ పర్సన్ రామలింగారెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో జరుగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి సర్వేను మరో 10 రోజులు పొడగించారని తెలిపారు. ఆశా వర్కర్లు ఉన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, ఆగస్టు 3: రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏవో వరలక్ష్మి ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం: రుద్రవరంలో 1993-94 పదో తరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మిత్ర బృందం సభ్యులు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు రక్తదానం చేయాలని కోరారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించండి

బేతంచెర్ల, ఆగస్టు 3: మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు పొలంబడి కార్యక్రమం వల్ల తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు సాధించవచ్చని డోన్ వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో డోన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అశోక్ వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, రైతు కాంతారెడ్డి పొలంలో కొర్ర పంటను పరిశీలించారు. ఏఈవోలు మధు, బెన్ని రాజు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించండి

కోవెలకుంట్ల, ఆగస్టు 3: మండలంలో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఖరీఫ్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటలకు సోమవారం నుండి పంట నమోదు కార్యక్రమం చేస్తారని తెలిపారు. కాబట్టి రైతులు గ్రామాల్లో ఆర్బీకేలలో ఉన్న వ్యవసాయ సిబ్బంది వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

బనగానపల్లె, ఆగస్టు 3: వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేమని ఉమ్మడి జిల్లాల వసుధ ఫౌండేషన్ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ అయద్‌బీ క్యాన్సర్ బాధితురాలికి రూ.10 వేలు ఆర్థిక సాయం శనివారం శీనయ్య కార్యాలయంలో అందించారు. టీచర్ నాగరాజు, ఖాదర్, నగేష్‌బాబు, దాదా బాషా పాల్గొన్నారు.

ఎస్సీల్లో ఐక్యత చెదరకుండా చూడాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణతో ఆసామాజిక వర్గంలోని ఉపకులాల మధ్య ఐక్యత చెదరకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కొలిమిగుండ్ల మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుజ్జల పెద్దయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని అన్నారు.

అవయవ దానం చేయండి

బనగానపల్లె, ఆగస్టు 3: అవయవదానం చేసి మరికొందరికి ప్రాణదానం చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద చారి అన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలో అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్‌ను విడుదల చేశారు. మనిషి చనిపోయినా అతని అవయవాలు తిరిగి బ్రతికించే అవకాశం అవయవదానంతోనే ఉందన్నారు. బాషా, రవి, రాజు, గాలన్న, లింగమయ్య పాల్గొన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం వద్దు'

రుద్రవరం, ఆగస్టు 3: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని డీఎల్‌డీవో మురళీ కళ్యాణి ఆదేశించారు. మండలంలోని కోటకొండ, యల్లావత్తుల, శ్రీరంగాపురం సచివాలయాలను శనివారం తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశారు. వీధిలైట్లు పగలు వెలగకుండా ఆన్ ఆఫ్ స్విచ్‌లు పెట్టాలన్నారు. సచివాలయాల్లో సర్వీసులు పెంచాలన్నారు. గైర్హాజరైన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీరంగాపురంలో కార్యదర్శి కొండయ్య, యల్లావత్తులలో వీఆర్వో వెంకటలక్షుమ్మ గైర్హాజరు కావడంపై వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'సన్మార్గంలో నడవాలి'

బనగానపల్లె, ఆగస్టు 3: మానవుడు ఆత్మ విజ్ఞాన మార్గాన్ని అందుకోవాలని, సన్మార్గంలో నడవాలని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి సూచించారు. శనివారం బనగానపల్లె మండలంలోని యనకండ్ల గ్రామంలోని శ్రీకృష్ణుని మందిరంలో టీటీడీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ధార్మిక కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నగోవిందు, ఉపసర్పంచ్ బొబ్బల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

బనగానపల్లె, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను ఆమోదించిందని, దీన్ని పునరాలోచించాలని కోరారు.

పాము కాటుకు అందుబాటులో టీకాలు: పాము, కుక్క కాటుకు సంబంధించిన టీకాలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.